




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 647 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర ఆదివారం 25 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం


### భారత్ సంస్కరణల

# ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

## - ప్రధాని నరేంద్ర మోదీ

భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు.



రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# కీలక చర్యలు చేపట్టిన ఇండిగో




దేశీయ విమానయాన రంగంలో ప్రముఖ సంస్థ అయిన ఇండిగో తన కార్యకలాపాల నిర్వహణకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో తమ విమానాల రాకపోకల కోసం కేటాయించిన స్లాట్లలో 717 స్లాట్లను ఇండిగో సంస్థ ఉపసంహరించుకుంది. ఇందులో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల నుంచి 364 స్లాట్లు ఉండగా, వాటిలో అధిక శాతం హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందినవి కావడం గమనార్హం. విమానాశ్రయం నుంచి విమానం టేకాఫ్ లేదా ల్యాండింగ్ కోసం కేటాయించే వ్యవధిని సాధారణంగా స్లాట్‌గా వ్యవహరిస్తారు. ఇండిగో సంస్థ జనవరి నుంచి మార్చి మధ్య కాలానికి చెందిన స్లాట్లను వదులుకోగా, మార్చి నెలలో అత్యధికంగా 361 స్లాట్లను ఖాళీ చేసినట్లు సమాచారం. గత డిసెంబరులో ఇండిగో సంస్థ వేల సంఖ్యలో విమాన సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితులను తీవ్రంగా పరిగణించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇండిగో వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత విధించింది. ఈ చర్యల అనంతరం ఇండిగో కార్యకలాపాలు క్రమంగా స్థిరపడినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# కాకినాడలో ‘నేషనల్ మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‘ ఏర్పాటుకు కేంద్రం సమ్మతి

## - కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి

కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : జిల్లా కేంద్రం కాకినాడలో కేంద్ర టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ‘నేషనల్ మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‘ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సమ్మతించినట్లు కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో చేనేతరంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కాకినాడలో మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెలలో కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు లేఖ రాయగా సానుకూలంగా స్పందించి సంబంధిత జిల్లా శాఖ అధికారుల నుండి ప్రతిపాదనలు పంపిస్తే ‘నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎన్. హెచ్. డి. పి)‘ ద్వారా త్వరలోనే కాకినాడలో మెగా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్




ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడించారు. హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు ద్వారా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగానికి జాతీయస్థాయిలో గుర్తింపు గుర్తింపు వస్తుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# తాళం వేసితిరి..

# గొళ్ళెం మరిచిరితిరి....!

## - ఇది రెండు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య - చెత్తతో దర్శనమిస్తున్న కుతుకుదిమిల్లి

యు.కొత్తపల్లి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : కొత్తపల్లి మండలం 17 గ్రామాల్లో చిన్ని గ్రామం కుతుకుదిమిల్లి. దీనికి సరిహద్దు గ్రామం కొత్తపల్లి. గడిచిన రెండు సంవత్సరాల క్రితం గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి ఆలయానికి హంగులు నిర్వహించారు. అమ్మవారి గుడికి కుడి వైపు పెద్ద చెరువు, ఏడవైపు ముత్యాలమ్మ చెరువు ఊళ్లు పుట్టబడిన దగ్గర నుండి ఏర్పడ్డాయి. పెద్ద చెరువులోని నీరు వ్యవసాయానికి వంతుల వారిగా వాడుకుంటూ ఉంటే, ముత్యాలమ్మ చెరువును దర్జీ దారులు బట్టలు ఉతికే చెరువుగా వాడుకుంటే, చేబ్రోలు సొసైటీ వారు ఈ మండల సభ్యులతో కలసి చేపల పెంపక కేంద్రాలుగా వాడుతున్నారు. దరిమిలా ముత్యాలమ్మ చెరువు ఆక్రమణలకు గురై వీరబ్రహ్మం వారి గుడి, చిన్నపాటి టిఫిన్ సెంటర్స్, సెలూన్ షాపులు, కిరాణా, ఎలక్ట్రికల్ మరమ్మతు షాపు ఇలా ఎవరికి దమ్ము ఉంటే వాళ్లు ఆక్రమించేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువును చెత్తవేసే డంపింగ్ కేంద్రంగా వినియోగిస్తూ చెరువును పూడ్చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య సత్యవాడ పాపారావు మాస్టర్ ఇంటిని చేర్చి చెత్తను చెరువు వైపు వరకు వేయడం పంచాయితీ పాలకవర్గం, అధికారుల పనితీరుకు దర్పం పడుతుంది. చెరువు గర్భాలను కాపాడాల్సిని వారే భక్షకులుగా మారి, పల్లెలను వికృతంగా తీర్చిదిద్దుతున్నారని విమర్శిస్తున్నారు. సత్వర చర్యలు సంబంధిత ఉన్నతాధికారులు గైకొని ఆక్రమణలను తొలగించి, పురాతన ముత్యాలమ్మ చెరువును ఆక్రమణ దారుల చెర నుండి విడిపించాలని, అదేవిధంగా పారిశుద్ధ్య పనులు సత్వరమే చేపట్టి ప్రజల ఆరోగ్యకు భరోసా ఇవ్వాలని ప్రజలు వేడుకుంటున్నారు



# దేవస్థాన భూమి ఆక్రమణదారులపై కఠిన చర్యలు

## - ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహరెడ్డి ఆదేశం



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 24 : పామూరు - నెల్లూరు హైవేలో ఉన్న భుజంగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెం. 439/5లోని 1.97 ఎకరాల భూమిని తూర్పు కట్టకిందపల్లికి చెందిన నరసింహులు అనే వ్యక్తి అక్రమంగా పెన్సింగ్ వేసి ఆక్రమించుకోవడంపై అధికారులు స్పందించారు. ఈ విషయంపై స్థానిక శాసనసభ్యుడు, ప్రకాశం జిల్లా టి.డి.పి అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహరెడ్డి మరియు తహశీల్దార్ తీవ్రంగా స్పందించారు. దేవస్థాన భూమిని ఆక్రమించడమే కాకుండా, తన అక్రమ పెన్సింగ్‌కు శాసనసభ్యుల ఫోటోను వాడుకుంటూ పేరు దుర్వినియోగం చేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి గిరిరాజు




నరసింహబాబు స్థానిక ఎస్ఐని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు అక్రమ పెన్సింగ్‌ను, అక్కడ పెట్టిన ఎమ్మెల్యే ఫోటోను తొలగించారు. గతంలో అధికారులు హద్దులు నిర్ణయించినా లెక్కచేయకుండా ఆక్రమణకు పాల్పడిన సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు. ఎవరైనా ప్రభుత్వ లేదా దేవస్థాన భూములను ఆక్రమించినా, ప్రజాప్రతినిధుల పేర్లను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని, వారిపై కఠినమైన శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆలయ కార్యనిర్వహణాధికారి హెచ్చరించారు. అదేవిధంగా స్థానిక ఎస్ఐ కట్టా అనూక్ ఇచ్చిన పిర్యాదు పై వెంటనే స్పందించి కానిస్టేబులను పంపించి పెన్సింగ్ తొలగించుటలో సహకరించారు.

# ఫోన్ ట్యాపింగ్ దోషులను వదిలే ప్రసక్తే లేదు

## -చట్టబద్ధంగానే విచారణ జరుగుతోందని వ్యాఖ్య -చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్తేమీ కాదన్న జూపల్లి

ఫోన్ ట్యాపింగ్ కేసులో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని రాజకీయ కక్షగా చిత్రీకరించడం పూర్తిగా తప్పని, ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి... ఈ కేసులో ప్రజాస్వామ్య పద్ధతిలో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌లో పాత్రధారులు ఎవరు? దీని వెనుక సూత్రధారులు ఎవరు? అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల పన్నుల డబ్బుతో నడిచే విజిలెన్స్, భద్రతా వ్యవస్థలను దుర్వినియోగం చేయడం దిగజారుడుతనమేనని వ్యాఖ్యానించారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన చర్యలను చూస్తూ ఊరుకోవాలా? దర్యాప్తే చేయకూడదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో ఎవరినీ లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకోవడంలేదని, పూర్తిగా చట్టబద్ధంగానే విచారణ సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందని అప్పట్లోనే వి.ప్రకాశ్ అనే వ్యక్తి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తన ఫోన్ ట్యాప్ అయినట్టు గతంలో వెల్లడించిన విషయాన్ని ప్రస్తావించారు. ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి కూడా ఇదే విషయం చెప్పారని అన్నారు. మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ సహా మరికొందరు కూడా తమ ఫోన్లు ట్యాప్ అయి ఉండొచ్చని అంగీకరించారని జూపల్లి తెలిపారు. కేటీఆర్‌కు కేవలం 160 సీఆర్పీసీ కింద మాత్రమే నోటీసులు ఇచ్చారని, ఆయనను నేరస్తుడిగా పరిగణించలేదని మంత్రి స్పష్టం చేశారు. సాక్షిగా సమాచారం కోసం మాత్రమే విచారణకు పిలిచామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన కోదండరామ్‌ను కూడా




గతంలో అక్రమంగా అరెస్ట్ చేసిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ... చట్ట ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ చేయడం కొత్త విషయం కాదన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావుపై కూడా మంత్రి ప్రశ్నలు సంధించారు. కీలక సమయంలో ఆయన అమెరికాకు ఎందుకు వెళ్లారని నిలదీశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు తిరిగి భారత్‌కు వచ్చారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో మార్పులకు అనేక కారణాలున్నాయని, వాటిపై కూడా సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

# నేడు రథసప్తమి పర్వదినం సందర్భంగా సింహగర్జన ప్రత్యేక కథనం




"" సూర్య జయంతియే రథసప్తమి ""
( ఆధ్యాత్మిక వ్యాసం)

మాఘ మాసంలో శుక్ల పక్షంలో వచ్చే సప్తమి తిథిని రథసప్తమి అంటారు. జనవరి 24, 10:59రావీ - జనవరి 25, 9:09రావీ

- రథసప్తమి రోజున ప్రత్యేకమైన స్నానం
- 7 జన్మల పాపాలు, 7 జన్మల దారిద్ర్యాలు అన్నీ పోగొడుతుంది
- 7 జిల్లేడు ఆకులు, 7 రేగి పండ్లతో తలస్నానం చేయాలి

రథసప్తమి రోజున అందరూ కూడా తలంటు స్నానం చేయాలి. ఏడు జిల్లేడు ఆకులు, ఏడు రేగి పండ్లు శిరస్సు మీద ఉంచుకుని తలంటు స్నానం చేయాలి. కొంత మంది ఏడు చిక్కుడు ఆకులు, ఏడు రావి చెట్టు ఆకులు తల మీద ఉంచుకుని స్నానం చేస్తారు. అలా చేసినా మంచిదే. కానీ, ప్రధానంగా జిల్లేడు ఆకులు, రేగి పండ్లు శిరస్సు మీద ఉంచుకుని రథసప్తమి రోజున తల స్నానం చేయాలి.

స్నానం చేసేటప్పుడు కొన్ని శ్లోకాలు చదువుకుని స్నానం చేస్తే అద్భుత ఫలితాలు కలుగుతాయని ధర్మశాస్త్ర గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ప్రధానంగా మూడు శ్లోకాలు చదువుకుంటూ రథసప్తమి రోజు స్నానం చేయాలి.

- మొదటి శ్లోకం

యద్ యద్ జన్మ కృతం పాపం మయా జన్మసు సప్తసు తన్మే రోగంచ శోకంచ మాకరీ హంతు సప్తమీ.

(ఈ జన్మలో చేసిన పాపాలు, దాంతో పాటుగా ఏడు జన్మల్లో చేసిన పాపాలు.. వాటి ద్వారా వచ్చిన రోగాలు, శోకాలు పోగొట్టుకోవడానికి నేను ఈ స్నానం చేస్తున్నాను అని చెప్పడం ఈ శ్లోకం అర్థం)

- రెండో శ్లోకం

ఏతజ్జన్మ కృతం పాపం యజ్జన్మాంత రార్జితమ్! మనో వాక్కాయజం యచ్చ జ్ఞాతాజ్ఞాతే చ యే పునః!!

(ఈ జన్మలో, జన్మజన్మాంతరాల్లో చేసిన పాపాలతో పాటుగా మనసుతో మాటతో శరీరంతో చేసిన పాపాలు, తెలసీ తెలియక చేసిన పాపాలు..వీటన్నింటిని పోగొట్టుకోవడానికి నేను స్నానం చేస్తున్నా అని చెప్పడమే ఈ రెండో శ్లోకంలోని అర్థం).

- మూడో శ్లోకం

ఇతి సప్త విధం పాపం స్నానాన్మే సప్త సప్తికే!
సప్త వ్యాధి సమాయుక్తం మాకరి హంతు సప్తమీ!!

(ఏడు రకాలైన పాపాలో పోవడానికి రథసప్తమి రోజు స్నానం చేస్తున్నాను. ఈ ఏడు రకాల పాపాల వల్ల, ఏ ఏడు జన్మల్లో పాపాల వల్ల వచ్చే అనారోగ్యాలన్నీ పోగొట్టే శక్తి కలిగున్న సప్తమి తిథి నీకు నమస్కారం స్నానం చేస్తున్నా అని చెప్పడమే ఈ శ్లోకం అర్థం).

- పూజ.. నైవేద్యం

స్నానం చేశాక చిక్కుడు పువ్వులు, చిక్కుడు ఆకులు, చిక్కుడు కాయలు, రకరకాల పుష్పాలు వీటన్నింటి కలిపి ఒక మండపంలాగా సూర్యకిరణాలు పడే ప్రాంతంలో కానీ ఇంట్లో కానీ ఏర్పాటు చేసి అందులో సూర్యుడి ఫోటో ఉంచి పూజ చేయాలి. సూర్యుడి ఫోటో లేదంటే తమలపాకు మీద తడి గంధంతో గుండ్రంగా ఒక రూపు గాసి దాన్ని సూర్యుడిగా భావిస్తూ ఎర్ర పూలు, అకితలు వేస్తూ ఓం సవిత్రే నమః అని మంత్రాన్ని 21 సార్లు జపించాలి.

రథ సప్తమి రోజు మీరు సూర్యుడికి ఏ పూజలూ చేసుకోలేకపోయినా పర్లేదు. సూర్య కిరణాలు పడే ప్రాంతంలో ఆవు పిడకలు ఉంచి వాటి మీద ఆవు పాలతో చేసిన పొంగలిని తయారు చేసుకుని ఆ పొంగలిని చిక్కుడు ఆకుల్లో ఉంచి సూర్య భగవానునికి నైవేద్యం పెట్టాలి. ఇలా ఆవు పిడకల మీద పొంగలి



తయారు చేసుకోవడం వీలు కాకపోయినా మామూలుగా అయినా ఆవు పాలతో పొంగలి చేయండి. ఆ పొంగలిని ఒక చిక్కుడు ఆకుల్లో ఉంచి సూర్యుడికి నైవేద్యంగా పెట్టండి. దాన్ని ప్రసాదంగా స్వీకరిస్తే ఆరోగ్యపరంగా కూడా ప్రయోజనం కలుగుతుంది.

- తప్పక చేయాల్సిన రెండు దానాలు

రథసప్తమి రోజున గొడుగు, చెప్పులు దానం ఇస్తే జన్మజన్మల పాపాలు, దారిద్ర్య బాధల నుంచి సులభంగా బయటపడొచ్చు.

- విషయ సేకరణ & కూర్పు :
సాహితిబంధువు :
- డా. ఆళ్ళ నాగేశ్వరరావు (కమల శ్రీ)
తెనాలి
చరవాణి :7416638823




## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ

మండపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : మండపేట పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం మొత్తం స్ఫూర్తినిచ్చేలా స్వచ్ఛభారత్ కార్యక్రమం నడుస్తోందని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో ఏ కార్యక్రమం చేసినా అది శాశ్వతంగా ఉంటుందని, ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు వస్తుందని అన్నారు. పరిసరాల పరిశుభ్రతే కాదు, ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలని చెప్పారు. ప్రతీ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడమే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర లక్ష్యం అన్నారు. ఇందులో ప్రతీ పౌరుడు భాగస్వామి కావాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ఆర్.పిలు తదితరులు పాల్గొన్నారు.

## కవితా శీర్షిక : "ఘనంగా గణతంత్ర దినం"

బానిస సంకెళ్ల నుంచి విముక్తి పొందిన
భారతదేశాన్ని...
ప్రజలే పాలకులై పరిపాలించాల్సిన
తరుణంలో...
డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మేధావుల
మేధోమథనం నుంచి భారత
రాజ్యాంగం ఆవిర్భవించింది...
ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగంగా
పేరొందింది!
ప్రజాస్వామ్య సౌధానికి పునాదియై
నిలిచింది!!
బైబిల్, ఖురాన్, భగవద్గీతల్లా
పవిత్రగ్రంథం...
భారతీయులను కలిపే ఐక్యతాబంధం
రాజ్యాంగం...
పరమాత సహనం వాటి ప్రబోధం...
సామాజిక న్యాయ సాధనం దీని
ప్రత్యేకం!
నాడు కొందరు ఆర్థికంగా
వెనుకబడి...
బండ్లలా పయనిస్తున్న తరుణంలో...
ఆ బండ్లను ఓడలుగా మార్చేందుకు..



రిజర్వేషన్ల లంగరు తొడిగి
ముందుకు లాగి ముందు వరుసలో
నిలిపారు!
నేడు ఓడలు బండ్లయై నిలిచి...
తారుమారైన పరిస్థితుల్లో...
రాజ్యాంగం లో సవరణలు చేయాల్సిన
తరుణం ఆసన్నమైనది!
ఆ దిశగా నేడు మేధావులు
ఆలోచనతో ముందడుగు వేయాలి!

సామాజిక ఆర్థిక అసమానతలను
నివారించాలి!
ఓట్ల సాధనే లక్ష్యంగా కాక...
ఓటర్ల సంక్షేమం దిశగా ప్రభుత్వం
అడుగులు వేస్తూ...
అవసరం మేరకు రాజ్యాంగ
సవరణలు గావించేందుకు
సంసిద్ధమౌతూ...
నేటి గణతంత్ర దినోత్సవంను
ఘనంగా జరపాలి!
ఆర్థిక అసమానతలు భారత పౌరుల
ధరి చేరకుండా చూడాలి!!!

- పేరు : డా. ఆళ్ళ నాగేశ్వరరావు
(కమల శ్రీ)
అంశం : గణతంత్ర దినోత్సవం
ప్రక్రియ : వచన కవిత
తేది : 26/01/2026
ఊరు : తెనాలి
జిల్లా : గుంటూరు
రాష్ట్రము : ఆంధ్రప్రదేశ్
చరవాణి :7416638823

## కర్మసాక్షికి ఈరోజు పర్వదినం..

కర్మసాక్షికి ఈరోజు పర్వదినం
ఎండల పండుగకు స్వాగతం
నేలపై కమలాలు సింగారించుకుని
ఆహ్వానించేందుకు సిద్ధమాయె..

అరుణుడు కిరణాల గుర్రాలతో
సప్తవర్ణ శోభితమై విరాజిల్లుతూ
అంబరాన్ని నూతన వస్త్రంగా
అష్టదిక్కులకు అలంకరించెనే..
కొత్త శోభతో అరుణోదయం కల్పించి
లేత కిరణాలతో వెలుగులు కురిపించె
శీతల పవనాల దుప్పటి కప్పుకున్న పుడమి
భాస్కరుని రాకతో వెచ్చదనం పొందింది..
ఆదిత్యుడి ప్రయాణానికి
ఛాయాదేవి హారతులు పట్టగా
నభాన అఖండ దివ్య వెలుగులతో
నక్షత్రాలు చిన్నబోయి మాయమాయె..

గగనం పుట్టిన వేడుకల సంబరంతో
వెలుగుల రాజుకు వేదిక సిద్ధం చేసింది
ప్రకృతిలోని పక్షుల గానాలతో
వసంతుడు ఆహ్వానం పలుకుతున్నాడు..

పండిన ఆకులు రాలిపోతుంటాయి
కాలధర్మం తన పని నిర్వహిస్తుంది
కొత్త చిగురాకుకు ప్రాణం పోసేందుకు
సృష్టికి ప్రాణదాత ముస్తాబై వచ్చెను..

అనంత విశ్వంలో అగ్నిగోళం
వసుధకు మాత్రం అన్న ప్రదాత
సూర్యుని వేడి దీవెనలే కాల ప్రయాణం
సుఖవంతమైన జీవితానికి ఆశీస్సులు..

వెలుగుల దీప్తి ప్రత్యక్ష దైవంగా నిలిచి
యావత్ సృష్టిని పాలిస్తూ
ప్రతి జీవికి తానై ప్రాణం పోస్తూ
అంబర సీమలో గంభీరంగా ప్రకాశిస్తున్నాడు..



- కొప్పుల ప్రసాద్ నంద్యాల
9885066235

## 2047 నాటికి ఎయిర్ పోర్టుల సంఖ్య 350కి పెంపు

-: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

2047 నాటికి దేశంలోని విమానాశ్రయాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 164 నుండి 350కి పెంచడమే లక్ష్యమని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారత విమానయాన సంస్థలు ఇప్పటికే 1,700 కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయని, వీటి రాకతో దేశీయ విమానయాన సామర్థ్యం మూడు రెట్లు వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఏటా 10 నుండి 12 శాతం వృద్ధిరేటుతో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌గా ఎదగడమే కాకుండా, మూడో అతిపెద్ద



మార్కెట్‌గా అవతరించిందని ఆయన వివరించారు. దేశీయంగా తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించడం ద్వారా గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ కీలక భాగస్వామిగా మారనుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దు

**అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు**

టీ హబ్‌ను ఒక ప్రత్యేక స్టార్టప్ కేంద్రంగానే కొనసాగించాలని, అందులోకి ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న కొన్ని ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఈ విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్‌ను స్టార్టప్‌ల కోసం ఒక ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. దాని స్వరూపాన్ని మార్చేలా ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేసే ఆలోచనలుంటే వెంటనే విరమించుకోవాలని ఆదేశించారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న



ప్రభుత్వ కార్యాలయాలను, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. ఏ పరిస్థితుల్లోనూ టీ హబ్ ప్రాధాన్యతను తగ్గించవద్దని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్ అండ్ ఆర్ కాలనిల్లో మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలు తూటికుంట, కొరుటూరు పంచాయతీల పరిధిలో మండల కూటమి అధ్యక్షుల సహకారంతో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ ను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మైదానంలోకి దిగిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వయంగా క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఆయన ఆటను చూసిన క్రీడాకారులు, ప్రేక్షకులు ఉత్సాహంతో చప్పట్లతో అభినందించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల వైపు దృష్టి సారించడం ఆనందకరమని, ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలో క్రీడలకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము,బీజేపీ మండల ప్రెసిడెంట్ గుడ్ల రాంబాబు,చాత్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, పోసి రెడ్డి, నాలి శ్రీనివాస్, తోట బాలు, గూడెల్లి లక్ష్మీనారాయణ, సిరిబత్తుల మధు, కోలా మధు, పాలొజి దుర్గా ప్రసాద్, సర్పంచ్‌లు, కూటమి నాయకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అవార్డులతో ప్రతిభ చాటిన కొండూరు

## 2025లో 64 అవార్డులు, 288 ప్రశంసాపత్రాలు కైవసం- శత కవి భూషణ బిరుదుతో రాణింపు

### - టాప్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2025గా గుర్తింపు

### - విద్య, సాహిత్య, కళా రంగాల్లో తెలుగు ఉపాధ్యాయుడు కొండూరు వెంకటేశ్వరరాజు కృషి అభినందనీయం







గూడూరు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : తిరుపతి జిల్లా గూడూరు మండల పరిధి విందూరు జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజు తరగతి గదిలో పాఠ్య బోధనతో తెలుగు భాషా మాధుర్యాన్ని విద్యార్థులకు బోధించడమే కాకుండా ప్రవృత్తిగా రచనలు, సృజన చిత్రాల ద్వారా తెలుగు భాష వికాసానికి, సామాజిక పరివర్తనకు తనదైన ప్రయత్నం చేస్తూ ఆకట్టు కుంటున్నారు. భిన్న సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేస్తూ తెలుగు సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యాన్ని గుర్తు చేస్తున్నారు. తనదైన సేవలతో విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగిస్తున్నారు. ఐఎస్ఓ గుర్తింపు కలిగిన వివిధ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్ వారి నుండి విద్య, సాహిత్య, సోషల్ వర్క్ రంగాలలో అనేక పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, ప్రపంచ రికార్డులు అందుకున్నారు. యోగా మరియు మెడిటేషన్ ఈవెంట్స్ లో పాల్గొనడం ద్వారా హోబిల్డ్ వరల్డ్ రికార్డును, 2500 తెలుగు సినిమా పాటల సేకరణతో ఓరియంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును, అత్యధిక అవార్డుల సాధకునిగా వరల్డ్ ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు. నరేంద్ర మోడీ, మన్మోహన్ సింగ్, బిఆర్ అంబేద్కర్, ఎపిజె అబ్దుల్ కలాం, మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా వంటి ప్రముఖుల పేరుతో అవార్డులు పొందారు. అలాగే సిరివెన్నెల, వేటూరి, ఘంటసాల, ఎన్టీ రామారావు, కృష్ణ, అక్కినేని నాగేశ్వరరావు, దాసరి నారాయణరావు వంటి తెలుగు సినీ కళాకారుల ఔన్నత్యంపై ఉత్తమ కవితలు రచించి ప్రశంసలు పొందారు. 2025 సంవత్సరంలో వివిధ స్థాయిల్లో 64 అవార్డులు, 288 ప్రశంసాపత్రాలు అందుకున్నారు. దుర్గదేవీ నవరాత్రి కవితోత్సవంలో పాల్గొని శత కవి భూషణ బిరుదును కూడా పొందారు. అంతర్జాలం వేదికగా వెంకటేశ్వరరాజు ఈజిప్టియన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ పీస్ అండ్ హ్యూమన్, సైన్సెస్ వారి నుండి గౌరవ డాక్టరేట్స్ తో పాటు నైజీరియా, బంగ్లాదేశ్, ఇరాక్, సౌతాఫ్రికా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా దేశాలకు చెందిన అంతర్జాతీయ విద్య, శాంతి, సామాజిక సేవా సంస్థల నుండి అవార్డులు పొందడం విశేషం. వెంకటాచలంలో ఉగాది కవి సమ్మేళనం సందర్భంగా తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రం డైరెక్టర్ సంపత్ కుమార్ నుండి సత్కారం పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెంకటేశ్వరరాజు కృషిని ప్రశంసించారు. అలాగే తెలుగు భాష సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ సేవ అధ్వర్యంలో నెల్లూరులో జరిగిన తెలుగు భాషోత్సవాల్లో సాహితీ ప్రముఖుల నుండి సన్మానం పొందారు. వెంకటేశ్వరరాజు ప్రతిభా పాటవాలను ప్రోత్సాహిస్తూ తాజాగా అంతర్జాతీయ సేవా సంస్థ హిందేవ్ నేచురోపతి హోలిస్టిక్ హీలింగ్ సెంటర్, ఢిల్లీ వారు టాప్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును ప్రదానం చేశారు. ఇందుకు సంబంధించిన దృవపత్రాన్ని హిందేవ్ నేచురోపతి హోలిస్టిక్ హీలింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ హిమాని అంతర్జాలం ద్వారా శనివారం వెంకటేశ్వరరాజుకు బహుకరించారు. ఈ సందర్భంగా సహచర కవులు, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరాజు కృషిని ప్రశంసించారు.

# "సహ-సృష్టి విద్యలో యువత శక్తి" అనే అంశం పై అవగాహ కార్యక్రమం



విశాఖపట్నం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 భారతదేశం – వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ (డబ్ల్యుసిఆర్పి) 2026 అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో మర్రిపాలెం 104 ఏరియాలోని పీఎం. శ్రీ కేంద్రీయ విద్యాలయ, ఎస్ వి ఎన్ – 1లో అవగాహన సంతకాల ప్రచార కార్యక్రమం జరిగింది. డాక్టర్ రామానుజ స్వామి చైర్మన్ (డబ్ల్యు సిఆర్పి) నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో "సహ-సృష్టి విద్యలో యువత శక్తి" అనే అంశం గురించి నొక్కిచెప్పారు. డాక్టర్ రామానుజ స్వామి విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రాథమిక హక్కుగా హైలైట్ చేశారు. పౌరులకు విద్యపై హక్కు మరియు వ్యక్తిగత వృద్ధి మరియు జాతీయ అభివృద్ధికి దానిని ఉపయోగించుకునే బాధ్యత రెండూ ఉన్నాయని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని (డబ్ల్యుసిఆర్పి) జిల్లా చైర్మన్ రిషి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సభ్యులు పాల్గొన్నారు, వీరిలో జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ రంగాల బాబురావు మరియు మార్టిన్ ఫెరార నేషనల్ లీడర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు (ఏపి) ఈశ్వరుడు ఉన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ మరియు సిబ్బందికి (డబ్ల్యుసిఆర్పి) కృత్ఞతలు తెలియజేసారు. శ్రీ శ్రీనివాస్ – ఇంగ్లీష్ లాంగ్వేజ్ హెచ్ఓడి దేవి శంకర్, శివ, పిహెచ్ఈ విభాగం మరియు భౌగోళిక శాస్త్రం పాండా, ఆర్థిక శాస్త్ర విభాగం రామన్నయ ముఖ్యంగా 9వ తరగతి నుండి 11వ తరగతుల వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జ్ఞానం మరియు అవగాహన ద్వారా విద్యను ప్రోత్సహించడం మరియు వినియోగదారులను శక్తివంతం చేయడంలో (డబ్ల్యుసిఆర్పి) యొక్క నిబద్ధతను ఈ కార్యక్రమం బలోపేతం చేసిందని నేషనల్ జాయింట్ సెక్రెటరీ (డబ్ల్యుసిఆర్పి) డాక్టర్ రంగాల బాబురావు తెలియజేశారు.




# గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం.

### ఎంపీడీవో సిహెచ్. సీతామహాలక్ష్మి.

చింతపల్లి :
77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించు కుందామని, స్థానిక ఎంపీడీవో సీ హెచ్ సీతా మహాలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించు కొని ఈ నెల 26 న మండల పరిషత్ కార్యాలయం ఆవరణ లో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.జాతీయ జెండా ఆవిష్క రణ కార్యక్రమం నకు స్థానిక ఎం పి పి కోరాబు అనూష దేవి, జెడ్ పి టి సి పోతురాజు బాలయ్య, ఏ ఎం సి చైర్ పర్సన్ కిల్లో ఊర్మిళ సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత లు ముఖ్య అతిథులుగా హాజరుకా నున్నారని ఆమె తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ వేడుకల కు , మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, పీసా కమిటీ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులు, ముఖ్యం గా పాత్రికేయులు విధిగా హాజరై గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు.






# లొల్ల లాకుల వద్ద టూరిజం అభివృద్ధికి అన్ని విధాల కృషి

### - శనివారం లొల్ల లాకులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 :
లొల్ల లాకుల వద్ద టూరిజం అభివృద్ధికి ఉన్న ప్రతీ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం ఆయన లొల్ల లాకుల వద్ద పర్యటించారు. లొల్ల లాకుల వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ అనంతరం పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆత్రేయపురం ఉత్సవం సందర్భంగా లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ పెస్టివల్ టూరిస్టులను ఆకర్షించిందన్నారు. మామూలు రోజుల్లో సైతం ఇక్కడకు పర్యాటకులు కుటుంబ సమేతంగా వచ్చి ఆహ్లాదకరంగా ఉన్న ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు తగిన చర్యలు తీసుకునేలా టూరిజం అభివృద్ధికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించామన్నారు.

# వైభవంగా శ్రీ సత్యదేవుని తిరుచ్చి సేవ



అన్నవరం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి, తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహనాధికారి వేంద్ర త్రినాథరావు మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు, వ్రత పురోహితులు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలి

## - : సీఐ అజయ్ కుమార్




మార్కాపురం, సింహగర్జన ప్రతినిధి, జనవరి 24 : యర్రగొండ పాలెం సీఐ అజయ్ కుమార్ ను సైనిక యూత్ మోటివేషన్ సొసైటీ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇంచార్జి మందా భాస్కర్ శనివారం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా సైనిక యూత్ మోటివేషన్ సొసైటీ చేస్తున్నా కార్యక్రమాలు మరియు ఫ్రీ మెటీరియల్స్, కోచింగ్, డ్రగ్స్ అవర్నెస్, ప్రోగ్రామ్స్ సీఐ అజయ్ కుమార్ కు వివరించడం జరిగింది. అనంతరం సీఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని, తన సపోర్ట్ ఉంటుందని తెలియజేశారన్నారు.

# నీటి కోసం ఇబ్బంది పడుతున్న ఒకటో వార్డు ప్రజలు

### - దగ్గరుండి మరమ్మత్తులు చేయిస్తున్న సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రయ్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సింహగర్జన, జనవరి 24 : అశ్వరావుపేట మండలం నారాయణపురం ఒకటో వార్డు నందు రెండు సంవత్సరాలుగా బోరు పనిచేయట్లేదు అని గ్రామస్తులు సర్పంచ్ కి తెలియజేయగా హుటాహుటిన మెకానిక్ ని పిలిచి తన సిబ్బందితో ఉదయం 6 గంటలకు చలిలో దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. దీనిని చూసిన ఆ వార్డు ప్రజలు నాయకుడంటే ఇలా ఉండాలి అని, ఆయనకి చెప్పటమే తడువుగా ఆ పని చేసినందుకు వార్డు తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకుడు పసుపులేటి నరేష్, మింద సుబ్బారావు, చలకోటి ఈశ్వరయ్య పాల్గొన్నారు.



# రక్తహీనతపై అవగాహన పెంచుకోండి,

## -అరకు టిడిపి ఇంచార్జ్ సియ్యారి దొన్నుదొర

అరకు లోయ..
కేంద్ర విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శనివారం అరకువేలి మండల కేంద్రంలో గల ప్రభుత్వ మహిళా కళాశాలలో సికిల్ సెల్ ఎనీమియా అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరకువేలి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఆర్టీసీ విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ


గిరిజన ప్రాంతంలో రక్తహీనత తో అనేక మంది ఇబ్బంది పడుతున్నారని సికిల్ సెల్ ఎనీమియతో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశార గిరిజన ప్రాంతాల్లో బ్లడ్ బ్యాంక్ లేక రక్తం విశాఖపట్నం నుండి తీసుకురాడం చాలా దూర ప్రాంతం నుండి రావడం గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి పర్యటన లో సికిల్ సెల్ ఎనీమియా గురించి వివరించగా గిరిజన సమస్యలు తెలుసుకుని బ్లడ్ బ్యాంక్ కొరకు సుమారు కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందని. పవన్ కళ్యాణ్ గారికి గిరిజన ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు, కేంద్ర గిరిజన




విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో సికిల్ సెల్ ఎనీమియా గురించి అవగాహన సదస్సు నిర్వహించడం చాలా సంతోకరమని విద్యార్థులు మీరందరూ రక్తంపై అవగాహన చేసుకొని మీ ప్రక్కన ఉన్న వారికి రక్తహీనత గురించి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అరకు వ్యాలీ మండల అధ్యక్షులు లోక్కోయి మహదేవ్ మాజీ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు మండల ప్రధాన కార్యదర్శి పాంగి రాజు అరకువేలి నియోజకవర్గ ఎస్టీ అధ్యక్షులు బురిడి కొములు నాయుడు చినలబుడు గ్రామ కమిటీ అధ్యక్షులు పాంగి భగత్ రామ్ తెలుగుయువత అరకువేలి నియోజకవర్గ అధ్యక్షులు సియ్యారి అజయ్ దొర టీన్సప్ అరకు నియోజకవర్గ అధ్యక్షులు పెట్టేలి బాలుదొర టీన్సప్ అరకు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కిల్లో సిద్దేశ్వర రావు పాల్గొన్నారుబి

# జి రాంజీ పథకం వద్దు. గాంధీ ఉపాధి చట్టం ముద్దు

పత్తికొండ
పత్తికొండ:వి బి రాంజీ పేరును వచ్చిన గ్రామీణ పథకం మాకు వద్దు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టమే మాకు ముద్దు అంటూ శనివారం పత్తికొండ పట్టణంలోని 18 19 వార్డు కుమ్మరి వీధి లక్ష్మీ టాక్స్ వెనక ఉన్న కాలనీలలో సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర అధ్యక్షతన ఉపాధి కూలీలకు కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎం రవిచంద్ర సిపిఎం మండల కమిటీ సభ్యులు సీనియర్ నాయకులు దస్తగిరి మాట్లాడుతూ 2005 సంవత్సరంలో వామపక్షాల కృషి వల్ల ఎన్నో ఉద్యమాల వల్ల వచ్చిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం ముజువాని ఓటుతో వి బి జి రాంజీ పేరున మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటని చట్టం ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతంలో వలసలు వెళ్లకుండా నివారించడం వల్ల కేంద్ర ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని చేతులు దులుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వంపై 40% మోపడం ఏదో ఒక రోజు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40% భారాన్ని మోయలేక ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేయాలన్న దురుద్దేశంతోనే ఇలాంటి ఎత్తుగడలు కొనసాగిస్తున్నాయని దీనిని గ్రామీణ ప్రాంతంలో కరువు పనికి పోయే ప్రతి ఒక్క వ్యక్తి యువకులు నిరుద్యోగులు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొని వారి యొక్క నిరసనను తెలపాలని వారు పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర పిలుపుమేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్దహుల్తి రాజుల కారప్ప, డివైఎఫ్ఐ నాయకులు జయప్రకాశ్ రెడ్డి, హుల్తిన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.









Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com